క్లుప్తంగా

నేడు శునకాలకు రేబిస్ నివారణ టీకాలు

భూపాలపల్లి రూరల్/కాటారం: ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా భూపాలపల్లి మున్సిపలిటీ పరిధిలోని జంగేడులో పశు వైద్య శాలలో, కాటారం మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు నేడు (ఆదివారం) ఉచిత రేబిస్ నివారణ టీకాలు వేయనున్నట్లు భూపాలపల్లి, కాటారం మండల పశువైద్యాధికారులు తిరుపతి, రమేశ్ శనివారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. రేబిస్ టీకాలు కనుకొన్న లూయిస్ పాశ్చర్ వర్ధంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పెంపుడు కుక్కలు ఉన్న వారు తప్పకుండా తమ కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలని సూచించారు.

జిల్లాకు హెలికాప్టర్ కేటాయించాలి

● సీపీఎం నాయకుడు రవిగౌడ్

ములుగు రూరల్: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయని వరద కారణంగా ప్రాణనష్టం జరుగకుండా ముందస్తుగా జిల్లాకు హెలికాప్టర్ కేటాయించాలని సీపీఎం నాయకుడు గుండబోయిన రవిగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం మండలంలోని సర్వాపూర్ వద్ద ఉన్న బొగ్గులవాగు ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గతంలో కురిసిన వర్షాల కారణంగా ప్రాణనష్టం, పశువులు కొట్టుకుపోవడం జరిగిందని అన్నారు. గోదావరి పరివాహక ప్రాంతాలలో లోతట్టు గ్రామాల ప్రజలకు ప్రమాదం పొంచి ఉందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బిక్కినేని కొండల్‌రావు, జనగాం కుమార్, వెంకటనర్సు తదితరులు పాల్గొన్నారు.

సాగు చట్టాలపై రైతులకు అవగాహన

వెంకటాపురం(ఎం): మండలంలోని నర్సాపూర్ పీఏసీఎస్ కార్యాలయంలో జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో రైతులకు సాగు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ కార్మిక చట్టాల గురించి, కౌలుదారు చట్టం గురించి రైతులకు వివరించారు. ప్రతీ రైతు భూములు కొనే ముందు భూమిపై ఏమైనా కేసులు ఉన్నాయా.. అప్పులు ఉన్నాయా అనేది చూసుకోని కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోతు స్వామిదాస్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



వాజేడు: చలో భద్రాచలం ధర్మయుద్ధ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ యువసేన(జేఏసీ) నాయకులు శనివారం పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలోని కొమురంభీం విగ్రహం వద్ద ధర్మయుద్ధ మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భద్రాచలంలో ఈ నెల 29న జరిగే ధర్మ యుద్ధ మహాసభకు ఆదివాసీ యువతీ, యువకులు తరలిరావాలని కోరారు. ఆదివాసీ యువసేన నాయకుడు లక్ష్మణ్, నరేష్, సంతోష్, పాపారావు, సమ్మయ్య, మల్లికార్జున్, వెంకటేష్, సృజన్ తదితరులు ఉన్నారు.

పత్తి పంటకు వానగండం

● వర్షాలకు ఎదుగుదల నిలిచిన పత్తి పైరు
● ఆందోళన చెందుతున్న రైతులు



అధిక వర్షాలతో ఎదుగుదల నిలిచిన పత్తి పంట

రేగొండ: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో సాగులో ఉన్న పత్తి పంటలు ఎదుగుదల నిలిచిపోయాయి. జూలై రెండో వారం నుంచి ప్రారంభమైన వర్షాలు ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కూడా కురవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. మొలిచిన పత్తి పంట అతి కష్టంగా ఎదుగుతోంది. ఈ క్రమంలో పంట ఎదుగుదల కోసం ఎరువులు, గడ్డి చావడం కోసం పలుమార్లు గడ్డి మందును పిచికారీ చేసినప్పటికీ ఆశించిన ఫలితాలు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

15 వేల ఎకరాల్లో సాగు

రేగొండ మండలంలో పత్తి పంటను 9,800 ఎకరాలలో, కొత్తపల్లిగోరి మండలంలో 5,420 ఎకరాలలో రైతులు సాగు చేస్తున్నారు. ఈ మొత్తం విస్తీర్ణంలో సగానికి పైగా పంట అధిక వర్షాలతో పూత నిలిచి, కాత ఆలస్యం అవుతోంది. అధికంగా కురుస్తున్న వర్షాల వల్ల పత్తి పంట చేతికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

రెండు ఎకరాల్లో సాగు చేశా..



ఈ ఏడాది రెండు ఎకరాలలో పత్తి పంట సాగు చేశా. విత్తనాలు నాటిన మొదట్లో కాలం మంచిగానే సహకరించింది. కాలం కలిసొస్తుందిలే అనుకుంటున్న సందర్భంలో వర్షాలు అధికమయ్యాయి. దీంతో చేలలో నీరు నిలిచి పంట ఎదుగుదల నిలిచింది. పంట ఎర్ర బారుతోంది. దీంతో ఈ సారి పత్తి పంట దిగుబడి తగ్గే అవకాశం ఉంది.

– కట్టస్వామి, రైతు, కొత్తపల్లిగోరి

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



భూపాలపల్లి రూరల్: బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే సత్యనారాయణరావు



భూపాలపల్లి అర్బన్: కోర్టులో బతుకమ్మ ఆడుతున్న జడ్జిలు, మహిళా న్యాయవాదులు

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఔన్నత్యానికి బతుకమ్మ పండుగ ప్రతీక అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం సాయంత్రం భూపాలపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంతో పాటు కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. క్యాంపు కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ కార్యకర్తలతో, కలెక్టరేట్‌లో వివిధ శాఖల మహిళా ఉద్యోగులతో కలిసి ఎమ్మెల్యే బతుకమ్మ ఆడారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ ప్రకృతితో ముడిపడి ఉన్న ఒక ప్రత్యేకమైన పండుగ అన్నారు. తెలంగాణ సామూహిక జీవన విధానానికి, ప్రజల ఐక్యతకు బతుకమ్మ పండుగ నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఎంగిలి పూల నుంచి సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజులలో ఆడబిడ్డలు అందరూ కలిసి బతుకమ్మ పాటలతో పండుగ జరుపుకుంటారన్నారన్నారు.

జిల్లా కోర్టులో సంబురాలు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కోర్టు ఆవరణలో శనివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దిలీప్‌కుమార్‌నాయక్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిల పాల్గొని బతుకమ్మ ఉత్సవాలను ప్రారంభించారు. మహిళా సిబ్బంది, న్యాయవాదులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ ఆటలు ఆడారు. ఈ ఏఓ అనితావని, శ్రావణ్‌రావు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి



శిక్షణ కార్యక్రమానికి హాజరైన తేజావత్

ములుగు: జిల్లాలో ఉన్న గిరిజన గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బంజారా సేవా సమితి సివిల్ సొసైటీ ఆర్గనైజర్ తేజావత్ జోగురాం నాయక్ పేర్కొన్నారు. శనివారం ములుగు ఏటీడబ్ల్యూఓ కార్యాలయంలో ఆదికర్మ యోగి అభియాన్ పథకంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ గిరిజనుల అభివృద్ధి, సంస్థల సాధికారత సాధించడం కోసం బడ్జెట్‌లో 79 వేల కోట్ల రూపాయాలను కేటాయించారన్నారు. ఈ పథకంలో భాగంగా మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ సారథ్యంలో ఐటీడీఏ సౌజన్యంతో జిల్లాలోని 10 మండలాలల్లో ఉన్న గిరిజన గ్రామాల స్థితిగతులను, వారికి ఉన్న సమస్యలను గుర్తించి గ్రామసభల ద్వారా ఆమోదించిన పనులను ఐటీడీఏ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పనుల జాబితాను పంపించినట్లు తెలిపారు. జిల్లాలో వెనుకబడిన కోయగూడెలను, తండాలను అభివృద్ధి చేయడమే ఈ పథకం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కోఆర్డినేటర్ సేన నాయక్, జిల్లా కోఆర్డినేటర్ ధరమ్ సింగ్, జిల్లా కోఆర్డినేటర్ చిన్నబాబు, మండల స్థాయి కర్మయోగిలు రాజు, సురేష్, రాజ్ కుమార్, రవి వర్మ, రాహుల్, కుమారస్వామి, సహాయ యోగిలు రాజెందర్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఏటీసీని సద్వినియోగం చేసుకోవాలి



వాజేడు: ఏటీసీ కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

● ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

వాజేడు: ఏజెన్సీ విద్యార్థులు అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ ఏటీసీ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీ విద్యార్థి ఏటీసీలో శిక్షణ తీసుకొని ఉద్యోగాలను పొందాలని కోరారు. ఆయన వెంట ఏటూర్ నాగారం ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, సొసైటీ అధ్యక్షుడు యగ్గడి అంజయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ విజయ, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, సొసైటీ ఉపాధ్యక్షుడు జగన్నాథరాజు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్, విశ్వనాథ ప్రసాద రాజు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వంతో మాట్లాడి న్యాయం చేస్తా..

వర్షాలు, గోదావరి వరద మూలంగా మండలంలో నష్ట పోయిన మిర్చి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం దృష్టికి విషయాన్ని తీసుకు వెళతానని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. ముంపునకు గురైన మిర్చి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారికి జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు.

ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం: మండలంలోని ఆర్ఐటీఐ కళాశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ఐటీడీఏ ఏపీఓ వసంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీఐలో ఆయా కోర్సుల లో గతంలోలాగా కాకుండా నూతన టెక్నాలజీతో కూడిన శిక్షణ అధ్యాపకులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఐటీఐలో విద్యార్థులు చేరి వారి భవిష్యత్‌ను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగన్‌మోహన్‌రెడ్డి, జేడీఎం కొండల్ రావు, పీసా కోఆర్డినేటర్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం కోసం పోరాడిన బాపూజీ



భూపాలపల్లి రూరల్: లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్



కాటారం: జయంతి వేడుకల్లో డీఎస్పీ సూర్యనారాయణ, నాయకులు



భూపాలపల్లి రూరల్: లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
● ఘనంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

భూపాలపల్లి రూరల్: నిజాయితీ, నిస్వార్థతకు ప్రతీక ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఐదు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా మంత్రిగా పనిచేసిన బాపూజీ తెలంగాణ కోసం ఢిల్లీలో నిరవధిక నిరాహార దీక్ష చేసిన మహనీయుడన్నారు. 1969లో మంత్రి పదవిని వదిలి ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన ఆయన రాజకీయ నిబద్ధతకు నిదర్శనమని వివరించారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ.. తెలంగాణ ఆత్మగౌరవ పోరాటంలో బాపూజీ పాత్ర చారిత్రాత్మకమని కొనియాడారు. ప్రత్యేక రాష్ట్రం కోసం తన జీవితాన్ని అర్పించిన మహనీయుని ఆశయాలు తరతరాలకు స్ఫూర్తినిస్తాయని అన్నారు. మంజూరునగర్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మ ఘనంగా ఆవిష్కరించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు

ఎస్పీ కార్యాలయంలో..

జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలకు అదనపు ఎస్పీ నరేష్ కుమార్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యమంలో పోరాడిన మహనీయుడని, ఆయన జీవితం ప్రజాసేవకు అంకితం చేశారన్నారు. ఆయన జీవితం నుంచి యువత ప్రేరణ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రత్నం, ఆర్ఎస్ఐలు, డీపీఓ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నివాళి..

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏర్పడిన బీఆర్ఎస్ రాష్ట్ర సమితి పార్టీ కొండా లక్ష్మణ్ బాపూజీ ఇంట్లోనే పుట్టిందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని జిల్లా కేంద్రంలోని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాపూజీ పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్‌బాపూజీ జీవితం ఆదర్శం

భూపాలపల్లి అర్బన్: కొండా లక్ష్మణ్‌బాపూజీ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి వేడుకలను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాటారం: కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎస్పీ సూర్యనారాయణ, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ కోట రాజబాబు అన్నారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడలిలోని లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు, పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల, పద్మశాలి సంఘం అధ్యక్షుడు దోమల సమ్మయ్య, నాయకులు మాచర్ల రాజేందర్, కొండా వెంకటేశ్వర్లు, గాదె రమేష్,పులి అశోక్, వలుస వెంకటేశ్వర్లు, పల్నాటి బలరాం, మాజీ ఎంపీటీసీ జాడి మహేశ్వరీ, మాజీ జెడ్పీటీసీ ఆంగోతు సుగుణ పాల్గొన్నారు.

‘చర్య తీసుకోవాలి’

శాయంపేట : మండలంలోని మాందారిపేట శివారులో పెద్దమ్మ కుంటలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌కు బహుజన సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మారపెల్లి విజయ్ కుమార్ వినతిపత్రం సమర్పించారు, అనంతరం విజయ్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామ శివారులో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పెద్దమ్మ కుంటలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు రాబోయే రోజుల్లో పెద్దమ్మ కుంట కనుమరుగు అవుతుందని, అక్రమంగా అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేపడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను చేపడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

మిత్రుడికి చేయూత

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన మంద జంపయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా విషయం తెలుసుకున్న మృతుడి కుమారుడు సురేష్‌తో పాటు 2005–06లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు శనివారం సురేష్‌ను, బాధితకుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.25వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. దాసి శ్రావణ్ కుమార్, రంగు రాజేష్, కోగిల సుమన్, పైండ్ల భాను, మోరె సుమన్, కోగిల తిరుపతి, బైని కర్ణాకర్, అల్లూరి శంకర్ ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

చిట్యాల: అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ యువజన సంఘం ఆవిర్భావించి 48 సంవత్సరాలు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో జెండా ఆవిష్కరించినట్లు తెలిపారు. గ్రామాలలో అంబేడ్కర్ సంఘాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దొడ్డి కిష్టయ్య, పుల్ల ప్రతాప్, దాసారపు నరేష్, గడ్డం సదానందం, పర్లపెల్లి కుమార్, అంబాల రాజు, పాముకుంట్ల చందర్, గుర్రం తిరుపతి, మైదం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

● ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు పైడి

గోవిందరావుపేట: మండలంలో త్వరలో నిర్వహించనున్న స్థానిక ఎన్నికల్లో (సర్పంచ్, వార్డ్ మెంబర్ల) ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ నాయకుడు ఇరుగు పైడి అన్నారు. శనివారం దళిత సంఘాలు మండల కేంద్రంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పైడి మాట్లాడుతూ.. మండలంలోని 18 గ్రామ పంచాయతీల రిజర్వేషన్ల ప్రక్రియలో ఎస్సీలకు ఒక్క వార్డు మెంబర్, సర్పంచ్ స్థానం కూడా కేటాయించకపోవడంపై చాలా బాధకరమన్నారు. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం మండలంలో ఇంతకుముందు ఉన్న ఎస్సీ రిజర్వేషన్లను తిరిగి అమలు చేయాలని తక్షణమే ఎస్సీ రిజర్వేషన్ వార్డులను కేటాయించాలని అన్నారు. అనంతరం ఎంపీడీఓ మమతకి దళిత సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి సుధాకర్, మడిపెల్లి శ్యాంబాబు, పసుల ముఖేష్, కోగిల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం

● నీట మునిగిన రహదారులు, పంట పొలాలు



కాటారంలో నీట మునిగిన పంటలు

కాటారం: కాటారం, మహాముత్తారం మండలాల్లో శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. వర్షంతో మండలాల్లో ప్రధాన రహదారులు, పంట పొలాలు జలమయంగా మారిపోయాయి. కాటారం మండల కేంద్రం నుంచి మహదేవపూర్ వైపు వెళ్లే జాతీయ రహదారిపై వరదనీరు నిలవడంతో చెరువును తలపించింది. రహదారి వెంట వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పత్తి చేలలో వరదనీరు నిలవడంతో రైతులకు భారీ నష్టం వాటిల్లింది. కాటారం మండల కేంద్రంలో సారయ్య, చిద్నెపల్లిలో సరోజన, అంకుషాపూర్‌లో మల్లయ్యకు చెందిన ఇల్లు వర్షానికి కూలిపోయాయి. ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు.

వాగులో కొట్టుకుపోయిన యువకుడు..

మహాముత్తారం మండలం ములుగుపల్లి, కాటారం మండలం అంకుషాపూర్ ప్రధాన రహదారిపై గల వాగులో యువకుడు బైక్‌తో సహా కొట్టుకుపోయి సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మహాముత్తారం మండలం ములుగుపల్లికి చెందిన రాజు బైక్‌పై కాటారం వైపు గా వస్తున్నాడు. మార్గం మధ్యలో అంకుషాపూర్ సమీపంలో గల వాగు దాటుతుండగా వరద ఉధృతి పెరిగి బైక్‌తో సహా కొట్టుకుపోయాడు. రాజుకు ఈత రావడంతో బైక్‌ను వదిలేసి బయటకు వచ్చాడు. అక్కడ ఉన్న వారు సురక్షితంగా రాజును ఒడ్డుకు చేర్చడంతో ప్రాణాపాయం తప్పింది.



కాటారంలో కూలిన ఇల్లు



కాటారం-మహదేవపూర్ జాతీయ రహదారిపై నిలిచిన వర్షపునీరు

అమ్మవారికి ప్రత్యేక పూజలు



మహాచండీ అలంకరణలో అమ్మవారు

మొగుళ్లపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివరామకృష్ణ భజనమండలి సభ్యుల సేవా సహకారంతో మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో కొలువుదీరిన దుర్గామాత శనివారం ఆరో రోజు అమ్మవారు మహాచండీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. క్యాతరాజు రాజయ్య దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వేణవంక నవీన్, ప్రసాద్, అన్నారెడ్డి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.